నూతన బస్టాండ్ ప్రారంభం

జిన్నారం(పటాన్‌చెరు): నూతన బస్టాండ్ ఏర్పాటుతో ప్రయాణికుల సమస్యకు పరిష్కారం లభించిందని రిటైర్డ్ హెచ్‌ఎం రాములు అన్నారు. జిన్నారం పట్టణ పరిధిలోని కొడకంచిలో పంచాయతీ నిధులతో నిర్మించిన నూతన బస్టాండ్‌ను ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం బస్సులో ప్రయాణించే ప్రజలు బస్టాండ్ లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. స్థానిక నాయకుల చొరవతో సమస్యను పరిష్కరించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు బడ్డే కృష్ణ, మాజీ సర్పంచ్ శివరాజ్, మాజీ ఉపసర్పంచ్ అభిలాష్ గౌడ్, గ్రామపెద్దలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

లక్డారంలో రక్తదాన శిబిరం

పటాన్‌చెరు: ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని లక్డారంలో ఆదివారం తలసేమియా బాధితుల కోసం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 36 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. కార్యక్రమంలో నవభారత్ నిర్మాణ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు మెట్టు శ్రీధర్, మాజీ ఎంపీటీసీ రామచంద్రారెడ్డి, కండర క్షీణిత వ్యాధి బాధితుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రవికుమార్, రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్రరెడ్డి, వేంకటేశ్వరస్వామి ఆలయం చైర్మన్ గోపాల్‌రెడ్డి, యువకులు తదితరులు పాల్గొన్నారు.

భారీ ధర పలికిన గణనాథుడి లడ్డూ

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం పట్టణ పరిధిలోని పాత హనుమాన్ ఆలయ సమీపంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతిష్ఠించిన గణనాథుని నిమజ్జన కార్యక్రయం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన వేలంపాటలో ఐఎన్టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మారెడ్డి రూ.15 లక్షల లడ్డూను సొంతం చేసుకున్నారు. విశేష పూజలు అందుకున్న గణపతి కరెన్సీ మాలను స్థానికులు ఆదికేశవరెడ్డి రూ. 6 లక్షలకు వేలంపాటలో దక్కించుకున్నారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గణనాథుని నిమజ్జన ప్రక్రియను పురవీధుల్లో ఘనంగా నిర్వహించి స్థానిక చెరువు వద్ద పూజలు చేసి నిమజ్జనం చేశారు. స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలి

కుత్బుల్లాపూర్: అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని, లేని పక్షంలో ప్రభుత్వ స్థలాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఆక్రమిస్తామని సీపీఎం మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ అన్నారు. ఆదివారం సీఐటీయూ కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో షాపూర్‌నగర్ కార్యాలయంలో పారిశ్రామిక ప్రాంత లోడింగ్, అన్‌లోడింగ్ హమాలీ కార్మికుల జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 60 లక్షల మంది అసంఘటితరంగ కార్మికులు ఎలాంటి చట్టాలు, హక్కులు లేకుండా పని చేస్తున్నారని, వారికి కనీసం ఉండడానికి ఇళ్లు లేక వేల రూపాయలు అద్దెలు చెల్లిస్తున్నారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు వారికి అందడం లేదన్నారు. సొంత ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకున్నా ఏళ్ల తరబడి ఎదురుచూపులు తప్పడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా 18 వేల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఎవరికి కేటాయించకపోవడంతో ఖాళీగా ఉన్నాయని, వాటిని వెంటనే పేద ప్రజలకు అప్పగించాలన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే సీపీఎం ఆధ్వర్యంలో నిరుపేదలకు అప్పగిస్తామన్నారు.

సెలూన్ ప్రారంభించిన హీరోయిన్ మీనాక్షి చౌదరి

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లిలోని పాపారాయుడు నగర్‌లో రోమియో అండ్ జూలియట్ యునిసెక్స్ సెలూన్‌ను ప్రముఖ హీరోయిన్ మీనాక్షి చౌదరి సెలూన్ మేనేజింగ్ డైరెక్టర్ వీరాతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వ్యక్తిగత గ్రూమింగ్ ఆధునిక జీవితంలో ఒక ముఖ్యమైన భాగమన్నారు. అందం, శైలి, విశ్వాసంతో పురుషులు, మహిళలు ఇద్దరికీ ఒకే చోట యూనిసెక్స్ ప్రీమియం గ్రూమింగ్ సేవలను అందించటం గొప్ప విషయమన్నారు. సెలూన్ మేనేజింగ్ డైరెక్టర్ వీరా మాట్లాడుతూ.. ప్రొఫెషనల్ నైపుణ్యం, కస్టమర్ సెంట్రిక్ సేవల ద్వారా అసాధారమైన గ్రూమింగ్ అనుభవాలను నిరంతరం అందించడమే తమ లక్ష్యమన్నారు.

సత్తా చాటిన విద్యార్థులు



కూకట్‌పల్లి: ఆల్విన్ కాలనీలోని బాల కృష్ణ హైస్కూల్‌లో ఆదివారం పైల్వాన్ క్లబ్ స్టేట్ లెవెల్ ఇంటర్ స్కూల్ ఛాంపియన్‌షిప్ 2025–26 అండర్ 10 విభాగం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఆదిత్యనగర్‌లోని రవీంద్ర భారతి పాఠశాల విద్యార్థులు పాల్గొని విజేతలుగా నిలిచారు. చెస్‌లో మొదటి బహుమతి చైత్రేశ్, పరుగుపందెంలో ద్వితీయ బహుమతి రిహాన్, పరుగు పందెం తృతీయ బహుమతి దీపా విజేతలుగా నిలిచారు. వీరిని పాఠశాల నిర్వాహకులు అభినందించారు.

నల్లగండ్ల చెరువులోని గణేశ్ నిమజ్జన కోనేరులో యంత్రాల ద్వారా వ్యర్థాలు, విగ్రహాలను తొలగిస్తున్న సిబ్బంది





నిమజ్జనం.. ప్రశాంతం.!

- కోనేర్లలో మొత్తం 9,741 విగ్రహాలు నిమజ్జనం
- కోనేర్ల శుభ్రతపై దృష్టి పెట్టిన అధికారులు
- చర్యలు చేపట్టిన సిబ్బంది
- శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో పనులు షురూ



శేరిలింగంపల్లి: ప్రశాంతంగా నిమజ్జన కార్యక్రమం ముగియడంతో ఇక అంతా గణేశ్ నిమజ్జన కోనేర్లు శుభ్రం చేయడంపై అంతా దృష్టి సారించారు. ఆదివారం సెలవు దినమైనా కోనేర్లలో గణేశ్ విగ్రహాలు, పూజా సామగ్రి, ఇతర వ్యర్థాలను తొలగించే పనులను శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో జీహెచ్‌ఎంసీ అధికారులు చేపట్టారు.ఉన్నతా ధికారులు, జోనల్ కమిషనర్ ఆదేశంపై జీహెచ్‌ఎంసీ సర్కిల్ డిప్యూటీ కమిషనర్, ఇంజనీరింగ్ విభాగం అధికారుల పర్యవేక్షణలో సిబ్బంది స్వయంగా, యంత్రాల సహాయంతో తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. కోనేర్లలోని వ్యర్థాలు, విగ్రహాలను కోనేర్ల పక్కనే చెత్త వాహనాలలో నింపి అక్కడి నుంచి డంపింగ్ యార్డ్‌కు తరలించి, కోనేర్లన్నింటినీ శుభ్రం చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. త్వరలో నిర్వహించే బతుకమ్మ వేడుకలకు కోనేర్లను సిద్ధం చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

చివరిరోజు 1,284 విగ్రహాలు.

◆ శేరిలింగంపల్లి సర్కిల్ పరిధి కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి డివిజన్లలోని కాలనీలు,బస్తీలలో ప్రతిష్ఠించిన వాటిలో సర్కిల్ పరిధిలోని గణేశ్ నిమజ్జన కోనేర్లలో మొత్తం 9,741 విగ్రహాలు నిమజ్జనం చేశారు. చివరిరోజైన శనివారం ఒక్కరోజే 1,284 విగ్రహాలను నిమజ్జనం చేసినట్లు అధికారికంగా సర్కిల్ అధికారులు వివరించారు. కాగా మట్టి వినాయకులనే పలు ఇళ్లలో ప్రతిష్ఠించి అక్కడే నిమజ్జనం చేసుకోవడం కూడా జరిగింది.

చందానగర్ సర్కిల్–21 పరిధిలో 1507 విగ్రహాల నిమజ్జనం

చందానగర్: చందానగర్ సర్కిల్ 21 పరిధిలో వాడ వాడలా కొలువుదీరిన గణనాథుల విగ్రహాలు 11 రోజులు పూజలు అందుకుని గంగమ్మ ఒడికి చేరుకున్నాయి. ఆదివారం తెల్లవారుజాము వరకు ఇళ్లలో నెలకొల్పిన చిన్న గణపయ్య నుంచి కాలనీలలో ఏర్పాటు చేసిన విగ్రహాలను వివిధ ప్రాంతాలలోని కోనేరులు, చెరువులలో నిమజ్జనం జరిగాయి. సర్కిల్ పరిధిలోని గంగారం చెరువు కోనేరులో 4704, గురునాథం చెరువులో 3797, కాయిదమ్మకుంట కోనేరులో 3576, కొత్తకుంట చెరువులో 1304, రేగులకుంట చెరువులో 463, పీజేఆర్ స్టేడియంలోని బేబీ పాండ్‌లో 1173 నిమజ్జనం జరిగాయని ఉపకమిషనర్ శశిరేఖ తెలిపారు.

శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని చెరువులలో విగ్రహాల నిమజ్జన వివరాలు

చెరువుపేరు	పూర్తి విగ్రహాలు	చివరి రోజు
మల్కంచెరువు	3404	445
నల్లగండ్ల చెరువు	2248	382
దుర్గం చెరువు	2256	391
గోపీచెరువు	1402	53
రంగనాథస్వామి టెంపుల్	248	08
చాకలి చెరువు	183	05
మొత్తం విగ్రహాలు	9,741	1,284

గ్రహణంతో ఆలయాల మూసివేత.!

సంప్రోక్షణ అనంతరం దర్శనానికి అనుమతి



గచ్చిబౌలి జీపీఆర్‌ఏ క్వార్టర్స్‌లోని ఆలయం మూసివేత

గచ్చిబౌలి: సంపూర్ణ చంద్రగ్రహణం నేపథ్యంలో శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలోని ఆలయాలన్నీ మూతపడ్డాయి. కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, చందానగర్, మియాపూర్, మాదాపూర్, హఫీజ్‌పేట్ డివిజన్ల పరిధిలోని కాలనీలు, బస్తీలలో ఆలయాలన్నింటిలో ఆదివారం మధ్యాహ్నం తర్వాత కొన్ని, సాయంత్రం మరికొన్ని ఆలయాలను మూసేశారు. అర్చకులు గర్భగుళ్లకు తాళం వేయడంతో పాటు ఆలయ ప్రధాన ద్వారానికి కూడా తాళం వేశారు. సోమవారం ఉదయం మళ్లీ ఆలయాలను తెరిచి సంప్రోక్షణ కార్యక్రమాన్ని నిర్వహించి ఆ తర్వాత దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేసి ఆ తర్వాత అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పిస్తారు. అందుకోసం ఆలయ నిర్వాహకులు, అర్చకులు ఏర్పాట్లు చేస్తారని వారు వివరించారు.

పార్టీలకు అతీతంగా బీసీలు ఏకం కావాలి



సమావేశంలో కార్పొరేటర్లు నాగేందర్‌యాదవ్, జగదీశ్వర్‌గౌడ్

శేరిలింగంపల్లి: పార్టీలకు అతీతంగా రాష్ట్రంలోని బీసీలు అంతా ఏకం కావాలని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ తెలిపారు. శేరిలింగంపల్లిలో బీసీ కులాలు, బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. రాష్ట్రంలోని బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని అన్నారు. 42 శాతం రిజర్వేషన్ల తీసుకొచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, కార్పొరేటర్ వి.జగదీశ్వర్‌గౌడ్, బీసీ ఐక్య వేదిక అధ్యక్షుడు భేరి రాంచందర్, నాయకులు డా. అరుణ్, శ్రీనివాస్ యాదవ్, వీరేశంగౌడ్, మహిపాల్‌యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, రవీందర్‌గౌడ్, రవియాదవ్, సాయన్న, గోపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా ఆవిష్కరణల్లో హైదరాబాద్ కీలకం



రాయదుర్గం: ఫార్మా ఆవిష్కరణల్లో హైదరాబాద్ నగరం కీలక పాత్ర పోషిస్తోందని హైదరాబాద్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్వాల దేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఫార్మా లీడర్‌షిప్ కాన్‌క్లేవ్–2025 కార్యక్రమం ఆదివారం గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ క్యాంపస్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ,.. మేనేజ్‌మెంట్ ఎక్స్‌లెన్స్‌కు మార్గదర్శకంగా హైదరాబాద్ మారుతోందన్నారు. వ్యాక్సిన్ డిప్లొమసీ, ఫార్మారంగంలో నూతన ఆవిష్కరణలో హైదరాబాద్ ఫార్మా ప్రముఖమన్నారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అజయ్‌మిశ్రా, నాట్కోఫార్మా మాజీ డైరెక్టర్ అనుప్ అన్విత్ చౌదరి, డాక్టర రెడ్డీస్‌ల్యాబ్స్ ప్రతినిధి అనుప్‌అవిజిత్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కో ఆర్డినేటర్‌గా వినోద్‌కుమార్



సన్మానిస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ తదితరులు

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానందనగర్ డివిజన్ యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా వెంకటేశ్వర్ నగర్, పోచమ్మ బస్తీకి చెందిన వినోద్‌కుమార్‌ను నియమించారు. ఆదివారం పీఏసీ చైర్మన్ గాంధీ ఆయనను సన్మానించారు. పార్టీ పథకాలను సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షురాలు విద్యాకల్పన, నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ కార్యవర్గ సభ్యురాలు శాలిని, జితేందర్, డివిజన్ నాయకుడు బొట్టు శ్రీను, అంబికా తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

బండ్లగూడ: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రేనా క్లీనిక్ గైనకాలజిస్ట్ డాక్టర్ ఎలిజబెత్ మండేలా అన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 18వ డివిజన్ ఆనంద్‌నగర్‌లో కొత్తగా నెలకొల్పిన రేనా క్లినిక్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. క్యుసిడి ల్యాబ్స్ అధినేత రవీందర్‌గౌడ్, ల్యాబ్ టెక్నిషియన్లు రమేష్, అల్దమస్, సునీల్, సంగీత, పూజలు ఆనంద్‌నగర్, ధాత్రి కాలనీ వాసులు రక్త పరీక్ష, మధుమేహం, థైరాయిడ్ వంటి ఆరోగ్య పరీక్షలు చేశారు. గైనకాలజిస్ట్ డాక్టర్ ఎలిజబెత్ మండేలా రోగులను పరీక్షించి తగు చికిత్స చేశారు. ఆనంద్‌నగర్ కాలనీ వాసులతో పాటు ధాత్రి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.శివరామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కొండా ఆనందరెడ్డి, వి.భాస్కర్ రెడ్డి, గాజుల చంద్రశేఖర్, కె.చంద్రశేఖరరెడ్డి, సీనియర్ సిటిజన్లు కొంపెల్ల కామేశ్వరరావు, ఎస్.రామలింగం, ఉలిగేశ్వర్, టి.శంకర్, ప్రసాద్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లా బ్యాడ్మింటన్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



మణికొండ: అంతర్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు హైదరాబాద్ జిల్లా క్రీడాకారులను మణికొండలో ఆదివారం ఎంపిక చేశారు. జనగామ జిల్లాలో ఈ నెల 13, 14వ తేదీలలో జరిగే పోటీలలో పాల్గొనే బాల, బాలికల జట్లకు పోటీలు నిర్వహించారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని అలకాపూర్ జయశంకర్ పార్కులో మణికొండ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సహకారంతో జరిగిన పోటీలలో హైదరాబాద్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు టి. మహేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి ఎం. శ్రీనివాస్‌ప్రసాద్, కోశాధికారి గౌరీశంకర్, స్థానిక అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో మరింత భద్రత

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పటాన్‌చెరు: భద్రతను పెంచడంలో కమ్యూనిటీ సీసీ కెమెరాలు ఎంతగానో ఉపకరిస్తాయని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని న్యూసాయి భగవాన్ కాలనీలో రూ. 2 లక్షల సొంత నిధులతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నేరాల నియంత్రణతో పాటు నేరగాళ్లను గుర్తించటంలో సీసీ కెమెరాలు పోలీసుశాఖకు కీలకంగా ఉపయోగపడుతున్నాయన్నారు. ప్రతీకాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటుతో నిరంతర నిఘాకు ఆస్కారం ఉంటుందన్నారు. ప్రధాన కేసుల ఛేదనలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. కాలనీ ప్రజల కోసం అతిత్వరలో మినీ ఫంక్షన్ హాల్, పార్కును అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, సీఐ నరేష్, సీనియర్ నాయకుడు మల్లేష్, బాలారాజు, ప్రమోద్ రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, కృష్ణ, జగదీష్, దాసు, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

హోరాహోరీగా లడ్డూల వేలం



మియాపూర్ ధర్మపురి టెంపుల్‌లో లడ్డూ ప్రసాదాన్ని వేలంపాటలో దక్కించుకున్న భక్తులు



లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్న భక్తులు

మియాపూర్: మియాపూర్‌లో లడ్డూ వేలం పాట హోరాహోరిగా సాగింది. మియాపూర్ దీప్తీశ్రీనగర్ కాలనీలోని ధర్మపురి క్షేత్రంలో ప్రతిష్టించిన వినాయక లడ్డూ ప్రసాదాన్ని శనివారం రాత్రి వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో రాజేష్ మొదటి లడ్డూను రూ.2.03లక్షలకు, రెండో లడ్డూను కిషోర్‌రెడ్డి రూ.81వేలు, మూడో లడ్డూ విజయ్ రూ.78వేలు, నాల్గో లడ్డూ నవీన్ రూ.23వేలకు వేలం పాటలో సొంతం చేసుకున్నారు. ఆలయ నిర్వాహకులు సత్యవాణి లడ్డూ ప్రసాదాన్ని వారికి అందజేశారు.

మక్తమహబూబ్‌పేటలో...

మియాపూర్ మక్తమహబూబ్‌పేటలోని హనుమాన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథుడి మొదటి లడ్డూ ప్రసాదాన్ని రూ.2లక్షల 50వేలకు హనుమాన్ అసోసియేషన్ సభ్యులు సొంతం చేసుకోగా రెండో లడ్డూను సారా నవనీత కుటుంబ సభ్యులు రూ.లక్ష 32వేలకు కైవసం చేసుకున్నారు.

మహిళలు పొదుపు సంఘాల్లో చేరాలి

సుభాష్‌నగర్: మహిళలు స్వతంత్రంగా తమ కాళ్లపై తాము నిలబడాలంటే అర్హులైన ప్రతి మహిళ పొదుపు సంఘాల్లో చేరాలని బాలయ్య నగర్ అధ్యక్షుడు నాగేష్ అన్నారు. ఆదివారం కొత్త గ్రూపులపై మహిళలకు అవగాహన కల్పించారు. బాలయ్య నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగేష్, మహిళ సంఘం అధ్యక్షురాలు పార్వతి, ఆర్పీ ధనలక్ష్మి మాట్లాడారు. గతంలో 16 గ్రూపులు ఉండగా, ఆరు నెలల వ్యవధిలో 25 గ్రూపులను తయారు చేశామన్నారు. మొత్తం 50 గ్రూపుల ఏర్పాటు లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కూకట్‌పల్లి: పేదల కోసమే సీఎంఆర్‌ఎఫ్ పథకం అమలవుతుందని, అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం అల్లాపూర్ డివిజన్‌కు చెందిన మద్దూరి మురళి కృష్ణకు రూ. 2 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును లబ్ధిదారుడికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన నిరుపేదలు కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకోవడానికి పథకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

10న స్వామివారికి పూజలు, అభిషేకం

మోతీనగర్: గాయత్రినగర్ వెల్ఫేర్ అసోసియేషన్, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 10న కాలనీలోని గాంధీ విగ్రహం వద్ద వినాయక మండపంలో స్వామి వారికి పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 11 గంటలకు సంకష్ట హర చతుర్థి సందర్భంగా లోక కల్యాణార్థం గాయత్రినగర్ భక్తుల అభ్యున్నతిని కోరుతూ 20 మంది లక్ష్మీగణపతి బ్రాహ్మణ సేవా సమితి వేద పండితుల సమక్షంలో పూజలు, అభిషేకం, హవనం, భజన కార్యక్రమం చేపట్టనున్నట్లు గాయత్రినగర్ వెల్ఫేర్ సంఘం అధ్యక్షులు వేముల కృష్ణారావు, ఉత్సవ కమిటి అధ్యక్షులు నందు కృష్ణారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పూజల్లో పాల్గొనే దంపతులు ముందుగా రూ.516 చెల్లించి రశీదు పొందాలని తెలిపారు. పూజల్లో పాల్గొన్న దంపతులకు అన్నప్రసాదం ఉంటుందని తెలిపారు.

చంద్రగ్రహణంతో ఆలయాల మూసివేత

మోతీనగర్: మూసాపేట డివిజన్ పాండురంగ నగర్‌లో దేవదాయ ధర్మాదాయ శాఖ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం పూజల అనంతరం మూసివేశారు. తిరిగి సోమవారం ఉదయం ఆలయాన్ని సంప్రోక్షణ చేసిన అనంతరం భక్తులకు శ్రీవారి దర్శనం ఉంటుందని ఆలయ కార్యనిర్వహణాధికారి గుమ్మడిదల సుధాకర్ తెలిపారు.

పేదలకు సహకారం అందించాలి



హోప్ ఆఫ్ హంగర్‌తో కలిసి రుద్రతేజకు వీల్ చైర్‌ను అందజేస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: పేదలకు సాయం చేయడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. హోప్ ఆఫ్ హంగర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ, పీజేఆర్‌నగర్ బ్లాక్ నెంబర్ 79లో నివసించే యాదగిరి కుమారుడు రుద్రతేజ చిన్నతనం నుంచి పోలియో వ్యాధితో బాధపడుతూ నడవలేని స్థితిలో ఉన్నారు. ఆదివారం రుద్రతేజకు ట్రస్ట్ తరఫున వీల్ చైర్‌ను కార్పొరేటర్ అందజేశారు. సంస్థ వ్యవస్థాపకురాలు అలేఖ్యకు ఆమె బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్. భాస్కర్, వాలి నాగేశ్వరరావు, మజర్, రవీందర్, మహేష్, బషీర్, సుధాకర్, వెంకట్, సావిత్రి, సంస్థ సభ్యులు వెంకటేశ్వరరావు, డి. కృష్ణారావు, రవికిరణ్, మీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



గోపినాథ్ (ఫైల్)

మియాపూర్: ఓ వ్యక్తి ఇంటి నుంచి వెళ్లి అదృశ్యమైన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మహబూబాబాద్‌కు చెందిన దారావత్ బాలు కుటుంబ సభ్యులతో కలిసి బ్రతుకు దెరువు కోసం నగరానికి వచ్చి మియాపూర్‌లోని న్యూ- హాఫీజ్‌పేటలోని ప్రేమ్‌నగర్ బీ-బ్లాక్‌లో నివాసముంటున్నారు. దారావత్ బాలు కుమారుడు దారావత్ గోపినాథ్ అలియాస్ హరీష్(23) సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. మూడు నెలల క్రిందట అనూష అనే అమ్మాయితో కుటుంబ సభ్యులు వివాహం జరిపించారు. ఈ నెల 19వ తేదీన తండ్రి దారావత్ బాలు స్వంత ఊరుకు వెళ్లినాడు. 20వ తేదీన ఇంటికి వచ్చి వెళ్లి చూసేసరికి కుమారుడు గోపినాథ్ ఇంట్లో కనిపించలేదు. అతడి ఫోన్‌నంబర్‌కు కాల్ చేయగా స్విచ్ఛాఫ్ అని వచ్చింది. కుటుంబ సభ్యులు పనికి వెళ్లిన సమయంలో గోపినాథ్ 20వ తేదీన 2గంటల నుంచి ఇంట్లో కనిపించడం లేదు. గోపినాథ్ గురించి చుట్టుపక్కల, స్నేహితులు, బంధువుల ఇళ్లల్లో ఎంతవెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో కుమారుడు గోపినాథ్ అదృశ్యమైనట్లు తండ్రి దారావత్ బాలు మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.